ఈ గండం గట్టెక్కేదెన్నడో..

నిండుగా ప్రవహిస్తున్న కత్వవాగు

- మూడేళ్లుగా కొనసాగుతున్న వంతెన నిర్మాణం
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న జనం
- ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వాగు దాటుతున్న గిరిజనులు



వాగు కాలువ వద్ద బారికేడ్లు


మేడిగడ్డతండా సమీపంలోని కత్వవాగు కాలువ దాటుతున్న గిరిజనులు

ఆమనగల్లు: మూడు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకల్లో జలప్రవాహం పరవళ్లు తొక్కుతుండగా.. పలు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. రహదారులన్నీ రూపం కోల్పోతున్నాయి. ఈదురు గాలులతో చెట్లు నేల కూలుతున్నాయి. శిథిలావస్థ ఇళ్లు పాక్షికంగా లేదా.. పూర్తిగా దెబ్బతినగా.. రవాణా మార్గం సరిగా లేని ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రస్తుతం ఆమనగల్లు మండల పరిధి గిరిజన తండా వాసులు ఇదే పరిస్థితి ఎదుర్కొంటున్నారు. మేడిగడ్డతండా నుంచి శంకరకొండతండాకు వెళ్లే మార్గంలోని కత్వవాగు ఉధృతంగా ప్రవహిస్తుండగా.. వంతెన లేని కారణంగా ప్రాంత ప్రజల రాకపోకలకు కష్టంగా మారింది. శంకరకొండతండా వాసులు ఇతర గ్రామాలకు వెళ్లాలంటే సుమారు 10 కిలో మీటర్లు చుట్టూ తిరిగి వెళ్లాల్సి ఉంటుంది. దూరభారమని భావించిన గిరిజనులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ఇలా ప్రవాహాన్ని దాటుతున్నారు. వీరితో పాటు దయ్యాలబోడుతండా, చెప్టతండా ప్రాంతాల ప్రజలవీ ఇవే కష్టాలు.

బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.10 కోట్లు

కత్వవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి ప్రధాన మంత్రి గ్రామసడక్ యోజన పథకం కింద మూడేళ్ల క్రితం రూ.3.10 కోట్లు మంజూరయ్యాయి. నిర్మాణ పనులకు నాటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ శంకుస్థాపన చేశారు. వీలైనంత త్వరగా పూర్తిచేస్తామని పేర్కొన్నారు. కానీ.. నేటి వరకు వంతెన పనులు పూర్తికాలేదు. దీంతో పలువురు గిరిజనులు మాట్లాడుతూ.. నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్.. మరో వ్యక్తికి బాధ్యతలు అప్పగించాడని, సదరు నిర్మాణదారుడు పనులు ప్రారంభించి, పిల్లర్ల దశలో వదిలేశాడని ఆరోపించారు. ప్రతి వర్షాకాలంలో రవాణా కష్టాలు ఎదురవుతున్నాయని వాపోయారు. బ్రిడ్జి నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో.. తమ కష్టాలు ఎప్పుడు తీరుతాయోనని గిరిజనులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి వంతెనను త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పనులు పూర్తిచేయాలి



వాగుపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరైనా.. పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా పిల్లర్ల వద్దే ఆగిపోయింది. వంతెన కోసం పలుమార్లు ఆందోళనలు చేపడితే పనులు ప్రారంభించారు. అసంపూర్తిగా వదిలేశారు.

– విజయ్‌రాథోడ్, మేడిగడ్డతండా

మరోసారి ఉద్యమిస్తాం



బ్రిడ్జి నిర్మాణం కోసం మేడిగడ్డతండా, శంకరకొండతండా వాసులం పలుమార్లు ఆందోళనలు చేశాం. అయినా పనులు ముందుకు సాగడం లేదు. పనులు వెంటనే పూర్తి చేయకపోతే మరోసారి ఉద్యమిస్తాం. ప్రస్తుత వర్షాలకు కత్వవాగు ప్రవహిస్తుండటంతో వాగును దాటేందుకు ఇబ్బంది పడుతున్నాం.

–నేనావత్ మహిపాల్, శంకరకొండతండా

అప్రమత్తంగా ఉండాలి



మేడిగడ్డతండా–శంకరకొండతండా మధ్యలో కత్వవాగు ప్రవహిస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వాగును చిన్నపిల్లలు, వృద్ధులు దాటేటప్పుడు యువకుల సాయం పొందాలి. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా వాగు వద్ద పోలీసు పికెట్ ఏర్పాటు చేశాం.

–వెంకటేశ్, ఎస్ఐ, ఆమనగల్లు

● మేళ్లకుంట.. నిండెనంట


ఏకధాటి వర్షాలకు మండల పరిధి మాదాయిపల్లి మేళ్లకుంట చెరువు పూర్తిస్థాయిలో నిండింది. ఆదివారం రాత్రి నుంచి అలుగు పోస్తోంది. దీంతో పరిసర ప్రాంత రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. సుమారు 300 ఎకరాల్లో భూగర్భ జలాలు పెరిగి, బోర్లల్లో నీటి మట్టం పెరగనుందని పేర్కొన్నారు. ఏటా రెండు పంటలను పండించుకుంటామని తెలిపారు - తలకొండపల్లి

జాగ్రత్తలు తప్పనిసరి


పాఠశాలలో సామగ్రి పరిశీలిస్తున్న అధికారులు

తలకొండపల్లి: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో జాగ్రత్తగా ఉండాలని ఎంపీడీఓ శ్రీకాంత్, తహసీల్దార్ రంగారెడ్డి అన్నారు. సోమవారం ఇరువురు అధికారులు మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహం, కస్తూర్బా బాలికల విద్యాలయాలను సందర్శించారు. పరిసరాలను పరిశీలించారు. మౌలిక వసతుల గురించి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడారు. భారీ వర్షాలకు భవనాలు కురిసే అవకాశం ఉందని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యం ముఖ్యమని, జ్వరం, జలుబు వచ్చిన వెంటనే వైద్యులకు చూపించాలని పేర్కొన్నారు. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేయించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీఓ రఘు, డాక్టర్ స్నేహ, ఆర్ఐ మంజుల, కార్యదర్శి సత్యం పాల్గొన్నారు.

వెంటాడుతున్న డంపింగ్ సమస్య


రాగన్నగూడ వార్డు కార్యాలయం వద్ద చెత్త ఆటోలు

తుర్కయంజాల్: ఇంటింటికీ తిరిగి చెత్త సేకరించే స్వచ్ఛ ఆటో కార్మికులకు డంపింగ్ సమస్య తలెత్తింది. సమస్యకు పరిష్కారం చూపాలని కోరుతూ సోమవారం నిరసన వ్యక్తంచేశారు. నాగోల్‌లోని డంపింగ్ యార్డ్‌లో పురపాలక సంఘం నుంచి చెత్తలోడుతో వచ్చిన ఆటోలను డంపింగ్ చేయడానికి నిర్వాహకులు అనుమతించలేదు. దీంతో పారిశుద్ధ్య కార్మికులు ఆటోలను రాగన్నగూడ వార్డు కార్యాలయం ఎదుట నిలిపారు. సమస్యకు పరిష్కారం చూపాలని అధికారులను కోరారు. దీంతో మున్సిపల్ చైర్ పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, కమిషనర్ అమరేందర్ రెడ్డి జీహెచ్ఎంసీ అధికారులతో మాట్లాడి, తాత్కాలికంగా సమస్యను పరిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. చెత్తను ఆటోల్లో తీసుకురావడం వలన సమస్యలు తలెత్తుతున్నాయని, చెత్తను టిప్పర్లల్లో తెస్తే.. తూకం వేయడానికి సులువుగా ఉంటుందని జీహెచ్ఎంసీ అధికారులు తెలిపినట్లు చెప్పారు.

సంక్షిప్త వార్తలు

❖ సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

ఆమనగల్లు: మండలంలోని ఆకుతోటపల్లి గ్రామ పరిధి గౌరారం గ్రామానికి చెందిన ఈశ్వరమ్మ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్సపొందింది. అనంతరం ఆమె సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా.. రూ.33 వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కును ఈశ్వరమ్మకు బీఆర్ఎస్ మండల నాయకుడు శ్రీనివాస్‌రావ్ అందజేశారు. సీతారామరావ్, కొండల్, శ్రీను, శివ, కష్టయ్య, అంజయ్య, సాయిరెడ్డి, గోపాల్ ఉన్నారు.

❖ కేజీబీవీలో వైద్య శిబిరం

తలకొండపల్లి: మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంలో వైద్యాధికారులు సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి స్నేహ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఫీవర్, జలుబు తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులను పంపిణీ చేశారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. వైద్య పరీక్షల్లో 7మంది విద్యార్థులు జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించామని పేర్కొన్నారు. మిగతా విద్యార్థినులు ఆరోగ్యంగానే ఉన్నారని వెల్లడించారు. సూపర్‌వైజర్ యాదమ్మ, హెల్త్ అసిస్టెంట్ రామ చంద్రయ్య, ల్యాబ్ టెక్నీషియన్ రాజేందర్ ఉన్నారు.

❖ ఇబ్బందులు లేకుండా చూడాలి

మంచాల: విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఎంపీడీఓ బాల శంకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని ఆయన సందర్శించారు. పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్య పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని, హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థినులకు పోషకాహారం అందించాలని సూచించారు. ఇందులో జీపీ కార్యదర్శి శ్రీనివాస్, వార్డెన్ పాల్గొన్నారు.

❖ తెగిన కట్టు కాలువ

తలకొండపల్లి: భారీ వర్షాలకు మండల పరిధి చంద్రధన కట్టు కాలువ ఆదివారం రాత్రి తెగింది. కాలువ ద్వారా ప్రవహించే నీరు సమీపంలోని నల్ల చెరువులోకి వెళ్తుందని, కాలువ తెగడంతో చెరువు నిండే పరిస్థితి కనిపించడం లేదని ప్రాంత రైతులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి తక్షణమే కాలువకు మరమ్మతు చేయించాలని కోరారు. లేని పక్షంలో భవిష్యత్తులో భూగర్భ జలాలు తగ్గి, సాగుపై తీవ్ర ప్రభావం చూపనుందని పేర్కొన్నారు.

క్లుప్తంగా

దెబ్బతిన్న ఇళ్ల పరిశీలన


ఇంటిని పరిశీలిస్తున్న తహసీల్దార్

ఆమనగల్లు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండల పరిధి మంగళపల్లి, పోలెపల్లి గ్రామాల్లో ఐదు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. ఈ సందర్భంగా సోమవారం తహసీల్దార్ లలిత ఆ ఇళ్లను పరిశీలించారు. ఒక్కో బాధిత కుటుంబానికి పది కిలోల చొప్పున రేషన్ బియ్యం అందజేశారు. ప్రభుత్వ పరంగా పరిహారం అందేలా కృషి చేస్తామని ఆమె చెప్పారు.

అలుగుకు మరమ్మతు

తలకొండపల్లి: వరుస వర్షాలకు మండల పరిధి దేవుని పడకల్‌లో పందివాని కుంట అలుగుకు గండి పడి నీరు వృథాగా పోతోంది. రైతుల కోరిక మేరకు స్పందించిన మాజీ సర్పంచ్ శ్రీశైలం.. సోమవారం మరమ్మతులు చేయించారు. జేసీబీతో మట్టి పోయించి, రంధ్రాలు మూసివేసి, నీటి వృథాను అరికట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీశైలం, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు అంబటి రమేష్, బిక్షపతి, రాములు, విజయ్, చెన్నయ్య, నర్సింహ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తలకొండపల్లి: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శ్రీకాంత్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఠాణాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా మండల పరిధి అన్ని గ్రామాల్లోని చెరువులు, కుంటలు, వాగులు పొంగి పొర్లుతున్నాయని, ఎవరు కూడా చేపలు పట్టడానికి వెళ్లకూడదని కోరారు. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో నివాసం ఉండరాదని, విద్యుత్ స్తంభాలను పట్టుకోరాదని హెచ్చరించారు. ప్రవహిస్తున్న వాగులు, కుంటలు, చెరువుల మీదుగా ప్రయాణం చేయరాదని, ప్రత్యామ్నాయ మార్గం ఎంచుకోవాలని పేర్కొన్నారు.

ఏడీఏగా సుజాత బాధ్యతల స్వీకరణ



ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులుగా ఎం.సుజాత సోమవారం బాధ్యతలు చేపట్టారు. మహేశ్వరం ఏడీఏగా పనిచేసిన ఆమె బదిలీపై ఇక్కడికి వచ్చారు. రెగ్యులర్ ఏడీఏ వెంకటేశ్వర్లు సెలవుపై వెళ్లడంతో ఇన్‌చార్జి ఏడీఏగా కొనసాగిన దివ్యజ్యోతి.. సంగారెడ్డి ఏడీఏ(ఎఫ్‌టీసీ)గా బదిలీ అయ్యారు. కాగా సెలవులపై వెళ్లిన వెంకటేశ్వర్లు ఆగస్టు 31న ఉద్యోగ విరమణ పొందారు. దీంతో పట్నం రెగ్యులర్ ఏడీఏగా సుజాత ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయ రంగానికి సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రజలు, రైతులకు సూచించారు.

పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్ల అందజేత


కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ చేసిన మాజీ సర్పంచ్

కడ్తాల్: పారిశుద్ధ్య కార్మికులకు మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి సోమవారం కడ్తాల్ జీపీ కార్యాలయ ఆవరణలో రెయిన్ కోట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాన్ని లెక్కచేయకుండా కార్మికులు పని చేస్తున్నారని, వారికి ఇబ్బంది కలగకూడదని తన వంతుగా చిన్న సహాయం చేశానని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ, లాయక్‌అలీ, నరేందర్‌రెడ్డి, రాంచంద్రయ్య, రామకృష్ణగౌడ్, రాములు, సురేందర్ రెడ్డి, అశోక్, వెంకటేశ్, సురేశ్ ఉన్నారు.

గ్రామ కమిటీ ఎన్నిక

మాడ్గుల: నూతనంగా బీసీడబ్ల్యూ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు సోమవారం సీఐటీయూ ఆమనగల్లు మండల కన్వీనర్ పెంటయ్య అధ్యక్షతన నియామక పత్రాన్ని అందజేశారు. భవన నిర్మాణ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా జిల్లా నర్సింహ్మ, ప్రధాన కార్యదర్శిగా తిరుపతయ్య, కోశాధికారిగా పులికంటి సైదులును నియమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ పరంగా భవన నిర్మాణ కార్మికులకు అందాల్సిన ప్రయోజనాలను వచ్చేలా నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఇందులో బీసీడబ్ల్యూ మండల అధ్యక్షుడు ముస్తాఫా, ప్రధాన కార్యదర్శి నర్సింహ్మ కార్మికులు ముత్యాలు, రవి తదితరులు ఉన్నారు.

కార్మికులకు అండగా ప్రభుత్వం


సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న పార్టీ శ్రేణులు, చేనేత కార్మికులు

ఆమనగల్లు: చేనేత కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉందని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. నేతన్నకు చేయూత పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.90 కోట్లు విడుదల చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం పార్టీ శ్రేణులు, చేనేత కార్మికులు జాతీయ రహదారిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, జగన్, గుర్రం కేశవులు, ప్రసాద్, శివలింగం, ఖాదర్, కృష్ణనాయక్, మైసయ్య, వస్పుల శ్రీశైలం, శ్రీకాంత్, సురేశ్, ఖలీం, మల్లేశ్, నాజర్, విజయ్, ఫరీద్, అలీం, శ్రీనునాయక్, బాబా, శేఖర్, చేనేత కార్మికులు శ్రీను, పురుషోత్తం, సత్యనారాయణ, సత్తయ్య, రంగయ్య, చంద్రశేఖర్, బుచ్చయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

అదనపు బస్సు నడిపించాలి


పట్నం డిపో ఎదుట నిరసన వ్యక్తంచేస్తున్న గ్రామస్తులు

మంచాల: బండలేమూరు గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఆ గ్రామ ప్రజలు సోమవారం ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉదయం 8 గంటలకు బండలేమూర్, చెన్నారెడ్డి గూడ గ్రామాలకు ప్రత్యేక బస్సును నడిపించాలని డిమాండ్ చేశారు. ఒకేఒక్క సర్వీసు ఉండడంతో ప్రాంత ప్రజలు రవాణా కష్టాలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పరిస్థితిని పరిశీలించి తక్షణమే బస్సు ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి స్పందించిన సంస్థ అధికారులు.. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ జెనిగె వెంకటేశ్, మాజీ సర్పంచ్ కృష్ణ, చెన్నారెడ్డి గూడ మాజీ ఉప సర్పంచ్ పిడుగు పరమేష్ తదితరులు ఉన్నారు.

మాసబ్ చెరువు కాలువ పరిశీలన


కాలువను పరిశీలిస్తున్న అధికారులు

తుర్కయంజాల్: మాసబ్ చెరువు నుంచి ఇంజాపూర్‌లోని దిలావర్‌ఖాన్ చెరువుకు నీరు పారే అలుగు కాలువను సోమవారం మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. అపిల్ అవెన్యూ, ఇందిరమ్మ కాలనీల్లో ముంపు బారిన పడిన ప్రజలతో మాట్లాడి, తగిన జాగ్రత్తలను సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ అమరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు ముంపు కాలువను పరిశీలించామని చెప్పారు. త్వరలో రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి, ఇరిగేషన్ ఏఈ తాఫ్సీన్ రజా తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై స్పెషల్‌డ్రైవ్


చాదర్‌పల్లిలో రోడ్డుపై మురుగును తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, పర్యవేక్షిస్తున్న ఎంపీఓ

యాచారం: పారిశుద్ధ్యంపై పంచాయతీ కార్యదర్శులు స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. సోమవారం మండల పరిధి మాల్, యాచారం, నందివనపర్తి, గునుగల్, చింతపట్ల, నక్కర్తమేడిపల్లి, మల్కీజ్‌గూడ తదితర గ్రామాల్లో మండల పంచాయతీ అధికారి శ్రీలత స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా నీటి ట్యాంకుల శుభ్రం, మురుగు కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగింప చేయించారు. అనంతరం బ్లీచింగ్‌పౌడర్ చల్లించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ముసురు వర్షం, వాతావరణ మార్పులతో విషజ్వరాలు సోకే అవకాశం ఉందని, వేడి చేసిన నీటినే తాగాలని ప్రజలకు సూచించారు. జ్వరాలు సోకితే వెంటనే పంచాయతీ కార్యదర్శులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు.

అర్హులందరికీ రుణమాఫీ


ఆమనగల్లు: కోనాపూర్‌లో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏడీఏ

ఆమనగల్లు: అర్హులైన రైతులందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని ఆమనగల్లు వ్యవసాయ శాఖ ఏడీ ఆదిలక్ష్మి చెప్పారు. ఆమనగల్లు మండలం కోనాపూర్, సీతారాంనగర్‌తండాల్లో సోమవారం కుటుంబ నిర్ధారణ కార్యక్రమంలో భాగంగా రైతుల వివరాలను ఆమె సేకరించారు. రుణమాఫీ లబ్ధిపొందని వారి నుంచి మరలా దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ.. రుణమాఫీ పొందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సర్వే అనంతరం అందరూ లబ్ధిపొందుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌గౌడ్, ఏఈఓలు ప్రభావతి, నిఖిత, భూదేవి తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: రుణమాఫీ పొందని రైతులు ఆందోళన చెందవద్దని మండల వ్యవసాయ అధికారి రేణుక చక్రవర్తి అన్నారు. మండల పరిధి వెల్జాల్‌లో ఆమె సోమవారం రుణమాఫీ సర్వే చేశారు. కుటుంబ సభ్యుల నిర్ధారణ, వివరాలు సేకరించారు. ఈ నెల 7 వరకు సర్వే కొనసాగుతుందని, ప్రతి రైతు కుటుంబం తప్పని సరిగా సర్వేలో వివరాలు నమోదు చేయించుకోవాలని సూచించారు.


ఆమనగల్లు: వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు


కడ్తాల్‌లో.. డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ నాయకులు

ప్రజా సంక్షేమ ప్రదాత

ముఖ్యమంత్రిగా, వ్యక్తిగతంగా వైఎస్ఆర్ ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయం. ఎన్నెన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి, పేదల గుండెల్లో కొలువైన మహానేత రాజశేఖర రెడ్డి అని కాంగ్రెస్ నేతలు, ఆయన అభిమానులు అన్నారు. వైఎస్ వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. దివంగత నేత.. ప్రజా సంక్షేమ ప్రదాత అని కొనియాడారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు.

- సాక్షి, నెట్‌వర్క్


ఇబ్రహీంపట్నం చెరువు కట్టపై..


తలకొండపల్లిలో..


మంచాల: ఆరుట్లలో..


మంచాల: లింగంపల్లిలో..